క్లుప్తంగా

ఉత్తమ రైతుకు సన్మానం



ఉత్తమ రైతును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన ఉత్తమ రైతుకు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320 ఆధ్వర్యంలో ఉత్తమ రైతును సన్మానించారు. ఈ మేరకు బుదవారం నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన రత్నగారి రాజేశ్వర్ రెడ్డిని నిజామాబాద్ జిల్లాలోని బోధన్‌లో కమ్మసంఘంలో జరిగిన సమావేశంలో ఉత్తమ రైతు రత్నగారి రాజేశ్వర్ రెడ్డి ఎంపిక చేసి రామాయంపేట లయన్స్‌క్లబ్ సహకారంతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నందుకు క్లబ్ గుర్తించి సన్మానం చేసిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్ నేషనల్ డైరెక్టర్ లయన్ బాబురావు, గవర్నర్ అమర్నాథ్ రావు, రీజినల్ చైర్మన్ సంజయ్ గుప్తా పరమేశ్వరచారి, లయన్స్‌క్లబ్ రామాయంపేట అధ్యక్షుడు దేమే యాదగిరి కార్యదర్శి జీడీ తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమి సర్వే నం.81, 87, 90లో 3 ఎకరాల 7 గుంటల భూమి రికార్డు పరంగా ఉందని, ఈ భూములు అన్యాక్రాంతం అయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ భూములతో పాటు నక్షబాటను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కమలాద్రికి వినతిప్రతం అందజేశారు. త్వరలోనే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు



ఫ్రెషర్ డేలో సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం(మెదక్): విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని సీఐ రేణుకారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఫ్రెషర్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. భవిష్యత్‌కు ఇంటర్ టర్నింగ్ పాయింట్ అని, ఏది సాధించాలన్నా ఇక్కడి నుంచి మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్తయ్య, ఎస్ఐ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా అదృశ్యం

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంట గ్రామానికి చెందిన ప్యాలారం సవిత(22) అదృశ్యమైనట్లు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ తెలిపారు. గ్రామానికి చెందిన అంజయ్య కూతురు సవిత ఈ నెల 23న ఇంటి నుంచి బయటికి వెళ్లింది. చీకటి పడినా తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. తండ్రి బోయిని అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. ఆమె ఆచూకీ లభిస్తే 87126 61847 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



సవిత

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రమేశ్ బాబు, ఫార్మసిస్ట్ శ్రీశైలం, ఏఎన్ఎం భాగ్య, ప్రిన్సిపాల్ శేషాచారి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విధిగా హాజరుకావాలని సూచించారు.

కంకర తేలి.. గుంతలు పడి..

- కొల్చారం మండలంలో గ్రామీణరోడ్ల దుస్థితి
- రోడ్లపై వెళ్లాలంటే ప్రయాణికులు, వాహనదారులకు నరకమే
- బస్సు నడవదు.. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం గగనం
- మండలంలో నెలకొన్న దుస్థితి



ఏటిగడ్డ మందాపూర్ గ్రామం మధ్యలో రహదారి దుస్థితి

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలంలోని గ్రామీణ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణికులు భయపడిపోతున్నారు. మండలంలో ఎక్కడ చూసినా ఎక్కడికక్కడ తారు లేచి, కంకర తేలి గుంతలు పడిన రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లడమేనని మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని పోతిరెడ్డిపల్లి,నాయిని జలాల్పూర్, అంసాన్ పల్లి, వసురం తాండ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఒక్కటే రహదారి. సుమారు 5 కిలోమీటర్ల మేర పూర్తిగా శిథిలమై ప్రయాణానికి ఏమాత్రం అనువుగా లేని ఈ రహదారిని, మూడేళ్ల క్రితం మూడున్నర కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టారు. మిగతా రహదారిని వదిలేయడం ఎక్కడికక్కడ తారు లేచిపోయి, గుంతలు పడి అధ్వానంగా తయారైంది. తప్పనిసరి పరిస్థితుల్లో మండల కేంద్రానికి పనుల కోసం వచ్చే పైగ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

బస్సు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలే దిక్కు

నాటి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మెటల్ రహదారిగా ఉన్న ఈ రోడ్డును పల్లెబాటలో భాగంగా ఎనగండ్ల, ఏటిగడ్డ మాందాపూర్, కోనాపూర్, పైతర, తుక్కాపూర్ గ్రామాలను కలుపుతూ రంగంపేట మీదుగా ప్రధాన రహదారి మెదక్– జోగిపేట వరకు తారు రోడ్డు వేశారు. ఏళ్ల గడిచిపోవడంతో రోడ్డు దెబ్బ తింది. దీంతో అక్కడక్కడా మరమ్మతులు చేశారు. మిగతా చోట్ల వదిలేశారు. దీంతో చాలా గ్రామాల్లో రహదారి దెబ్బతిని ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలోని అన్ని రోడ్లది దాదాపు ఇదే దుస్థితి. ఈ రోడ్లపై ఆర్టీసీ బస్సు ఎలాగూ రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో వాహనాలు దెబ్బ తినడం, సకాలంలో గమ్యాన్ని చేరుకోక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులను కదిపితే రోడ్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైతే కానీ పనులు ముందుకు సాగించలేమని సమాధానం చెబుతున్నారు.



వీధిలో పేరుకుపోయిన చెత్త

సమస్యల వలయంలో అచ్చన్నపల్లి

- కదలని ట్రాక్టర్.. పేరుకుపోయిన చెత్త
- రోగాల బారిన పడుతున్న గ్రామస్తులు



మరమ్మతులకు నోచుకోక మూలన పడిన ట్రాక్టర్

టేక్మాల్ (మెదక్): పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. చెత్త సేకరణలో అలసత్వం వహించడంతో కుప్పలుగా పేరుకుపోయింది. వీధులన్నీ గడ్డి పొదలతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని అచ్చన్నపల్లి గ్రామం సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రెండు నెలలుగా చెత్తను సేకరించే ట్రాక్టర్ మూలన పడింది. కనీస మరమ్మతులకు నోచుకోక వర్షంలో తుప్పు పడుతుంది. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. ఈగలు, దోమలకు ఆవాసంగా మారి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. నిధులు లేవని చేతులెత్తేయడంతో గ్రామ పాలన కుంటుపడింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకుకూరలతోనే ఆరోగ్యం



పోషణ మాసం ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, మహిళలు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమర్‌సుల్తాన



నార్లాపూర్‌లో సామూహిక శ్రీమంతాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఆకుకూరలతోనే ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ఖమర్‌సుల్తాన తెలిపారు. బుధవారం మండలంలోని కూకుట్లపల్లిలో పోషణ మాసం సందర్భంగా పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారం పంపిణీ చేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆకుకూరలు, బాలామృతంతో తయారుచేసిన ఆహారం ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరీ, సద్గుణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార వారోత్సవాలు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, విజయ , శిరీష, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆహారం

వెల్దుర్తి(తూప్రాన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాసాయిపేటలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో బుదవారం పోషణమాసం నిర్వహించారు. పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు, చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు క్రమం తప్పకుండా తీసుకోవడంతో కలిగే ఉపయోగాలను వివరించారు.అనంతరం ఆరోగ్యకరమైన జీవన శైలిపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఏడీఏ పుణ్యవతి
- రాయిలాపూర్‌లో పంటల పరిశీలన



రాయిలాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ పుణ్యవతి తెలిపారు. బుధవారం మండలంలోని రాయిలపూర్‌లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో కంకినల్లి, బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు గమనించారు. రైతులు ప్రతిరోజు పంటను పరిశీలించాలన్నారు. పొలంలో తెగులు, వ్యాధులు సోకినట్లు కనిపిస్తే వ్యవసాయ అధికారులు సంప్రదించాలన్నారు. కంకినల్లి నివారణకు ఎకరాకు స్పైరోమెసిఫెన్ 200ఎంఎల్ రసాయనాన్ని పదిహేను రోజుల వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేయాలని చెప్పారు. బ్యాక్టీరియా ఎండుఆకు తెగులు నివారణకు ఎకరాకు అగ్రిమైసిన్ 80గ్రాములు లేదా స్ట్రెప్టోసైక్లిన్ 40–60 గ్రామలు చొప్పులు ఐదు నుండి ఏడు రోజులు వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలని చెప్పారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓ నరేందర్, పాల్గొన్నారు.

ధ్యానంతో మనశ్శాంతి

పెద్దగొట్టిముక్లలో ధ్యాన మందిరం ప్రారంభం



ధ్యాన మందిరం ప్రారంభిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): నిత్య ధ్యానంతో మనిషికి మనశ్శాంతి లభిస్తుందని పత్రీజీ ఆశ్రమ శిష్యుడు గణేష్ అన్నారు. బుధవారం మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామ శివారులోని ఉమా సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పత్రీజీ మహాశ్రీ శ్రీ చక్ర ధ్యాన ఆశ్రమాన్ని ప్రారంభించారు. మనిషి నిజ జీవితంలో మనశ్శాంతి లేకుండా కాలాన్ని వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొందని, దాన్ని అధిగమించేందుకు గాను సమయం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. దాతల సహాయంతో 80 మంది ధ్యానం చేసుకునేందుకు వీలుగా ఇక్కడ నిర్మాణం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది హన్మంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, వివిధ పార్టీల నాయకులు ధర్మారెడ్డి, మురళి, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, నవీన్, శంకర్‌గౌడ్, వివిధ ప్రాంతాలకు చెందిన పత్రీజీ మహాశ్రీ శిష్యులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

కొల్చారం (నర్సాపూర్): పంట సాగు చేసేందుకు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం–2025 వానాకాలానికి అవసరమైన సబ్సిడీ వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయని శ్వేత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న మహిళా రైతులకు 50 శాతం , మిగతా రైతులకు 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. బ్యాటరీ స్ప్రేయర్, ఫుట్ ఆపరేటర్ స్ప్రేయర్ జనరల్ 122, పవర్ స్ప్రేర్స్ 25, ట్రాక్టర్ డ్రాయింగ్ ఇంప్లిమెంటేషన్ కింద మీద పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో జనరల్, ఎస్సీ, ఎస్టీ రైతులు అర్హులన్నారు. పరికరాలు అవసరమైన రైతులు ఆధార్ జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ పత్రాలను జత చేస్తూ అప్లికేషన్ నింపి గ్రామాల్లోని ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

వ్యవసాయ పనిముట్లు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందించనున్నట్లు ఏఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే కల్టివేటర్, కేజీవీల్, రోటవేటర్, స్ప్రే పంప్‌లు సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అవసరమైన రైతులు దరఖాస్తులు అందించాలని కోరారు. ఇతర వివరాల కోసం రైతువేదికలలో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

అన్నపూర్ణదేవిగా దుర్గామాత

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం దుర్గామాత అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలుచోట్ల మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



విశేషాలంకరణలో కన్యకా పరమేశ్వరీ మాత



అన్నపూర్ణదేవిగా చండీకాంబ



శివ్వంపేట: దొంతిలో దుర్గామాతకు పూజలు



కొల్చారం: పోతంశెట్టిపల్లిలో పూజలు అందుకుంటున్న దుర్గామాత



కొల్చారం: రంగంపేటలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



హవేళిఘణాపూర్: జక్కన్నపేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో అన్నపూర్ణమాతగా దుర్గాదేవి



పెద్దశంకరంపేట: అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

బతుకమ్మ సంబరాలు



నర్సాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చేగుంట(తూప్రాన్): కర్నాల్‌పల్లిలో బతుకమ్మ ఆటాపాట

రాయితీపై వ్యవసాయ పరికరాలు

నర్సాపూర్: ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తుందని వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ పరికరాలు కావాల్సిన రైతులు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు ఫాం నింపి అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, మిగిలిన రైతులకు 40 శాతం రాయితీ ఉంటుందన్నారు. తన డివిజన్ పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు ఉన్నాయని ఆమె వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్టు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈనెల 25న అంగన్‌వాడీల సమస్యల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చలో సెక్రెటరియెట్ ముట్టడి నిర్వహించనున్నారు. దీంతో ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు అంగన్‌వాడీ టీచర్లు కమల, సుమిత్ర, నిర్మల, రజియ తదితరులు ముందస్తు అరెస్టు చేసి, అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

◆ అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు పట్ల ఖండన

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లను ముందస్తు అరెస్టులు చేయడాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు ఖండించారు. అంగన్‌వాడీ సెంటర్లలో నెలకొన్న సమస్యలతో పాటు ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈనెల 25న సీఐటీయూ ఆధ్వర్యంలో చలో సెక్రటరియెట్ కార్యక్రమం చేపట్టామని, కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు మహిళ ఉద్యోగులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లిలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన కొలుకూరి రంగారెడ్డికి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా నియోజకవర్గ నాయకులు రాజిరెడ్డి చొరవతో రూ.35 వేలు మంజూరు చేయించారు. చెక్కును స్థానిక నాయకులు పోచయ్య, అంజాగౌడ్‌ల చేతు మీదుగా అందించినట్లు శ్రీకాంత్ తెలిపారు.

◆ రేపు తల్లిదండ్రుల కమిటీ సమావేశం

చేగుంట(తూప్రాన్): విద్యార్థుల అభ్యాసనపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హాజరు, వారి సబ్జెక్టుల్లో చదువుతున్న తీరు.. ఇప్పటివరకు నిర్వహించిన పలు పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ప్రకటిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ అభిప్రాయాలు వెల్లడించి తగు సూచనలు చేయనున్నారు. వార్షిక పరీక్షలకు సుమారు నాలుగు నెలల సమయం ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలని కోరనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు.

◆ గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



శ్రీశైలం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని వెంకట్రావుపేటకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ శ్రీశైలం బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

◆ ఐలమ్మ ఆశయ సాధనకు కృషి

మెదక్‌జోన్: ఈనెల 26న వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని పట్టణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు రజక సంఘం పట్టణ యూత్ అధ్యక్షుడు బక్కవారి శివ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బైక్ ర్యాలీలో రజక నేతలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డిపల్లి విజయ్, పట్టణ అధ్యక్షుడు చౌదరి మల్లయ్య సంతు, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు